క్లుప్తంగా

మట్టి గణపతిని పూజిద్దాం



ప్లకార్డులతో ర్యాలీ చేస్తున్న స్కాట్ విద్యార్థులు

శ్రీకాళహస్తి: తొండమనాడు జెడ్పీ ఉన్నత ఊపాఠశాలలో భారత్ స్కాట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు మట్టి గణపతిని పూజించండి.. పర్యావరణాన్ని కాపాడండంటూ ప్లకార్డులతో ర్యాలీ చేపట్టారు. అనంతరం మట్టితో వినాయక ప్రతిమలను తయారు చేసి, పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కృష్ణయ్య, స్కాట్ మాస్టర్ జయసింహ, గైడ్ కెప్టెన్ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాస రచన, చిత్రలేఖన పోటీలు



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

బుచ్చినాయుడుకండ్రిగ: తెలుగు భాషా దినోత్సవంలో భాగంగా మండలంలోని కల్లివెట్టు జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు వ్యాస రచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించినట్లు తెలుగు ఉపాధ్యాయుడు యువశ్రీమురళి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో మాతృభాష తెలుగు ఆవశ్యకత, ఔన్నత్యం, భాషాభిరుచిని కలిగించాలనే సంకల్పంతో ఒక్కో అంశంలో విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. తెలుగు భాషా దినోత్సవం రోజున విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం వాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

160 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు



పరీక్షలు చేస్తున్న వైద్యురాలు

బుచ్చినాయుడుకండ్రిగ: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో అవరణలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 160 మంది విద్యార్థులకు వైద్యురాలు ప్రత్యూష రవితేజ కంటి పరీక్షలు చేసినట్లు చాగణం లలితమ్మ భాస్కర్‌రావు మెమోరియల్ ట్రస్టు ఎండీ చాగణం గౌరీశంకర్, సీఈఓ సీతారామ్‌నాయుడు తెలిపారు. పెళ్లకూరు చాగణం లలితమ్మ, భాస్కర్‌రావు మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో మంగళవారం శ్రీవేంకటేశ్వర అరవింద్ నేత్రాలయ హాస్పిటల్ తిరుపతి వారి సహకారంలో 160 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారన్నారు. 70 మందికి ఉచితంగా మందులు పంపిణీ చేయగా, 50 మందికి ఉచిత కంటి అద్దాలు పంపిణీ చేశామన్నారు. 30 మందికి ఉచితంగా తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర అరవింద్ నేత్రాలయలో ఉచితంగా కంటిపొర ఆపరేషన్ చేయిస్తామని తెలిపారు. భోజనం, రవాణ, మందులను ఉచితంగా అందజేస్తామని ఏఓ గల్లా కృష్ణ తెలిపారు. చాగణం గౌరీ శంకర్ ఉచితంగా భోజన ఏర్పాట్లు చేశారు.

ఎరువుల దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు



రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని పలు ఎరువుల దుకాణాలను జిల్లా వ్యవసాయ అధికారి ప్రసాద్ రావు మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఎరువుల దుకాణాల్లో ఎరువులు పక్కదారి పెడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. రైతులకు ఎరువులు అధిక ధరలకు విక్రయించకూడదన్నారు. అనంతరం దుకాణాల్లో రికార్డులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి డివిజన్ ఏడీఏ (పీపీ), డీఏఓ ఆఫీస్ తిరుపతి ధనంజయ రెడ్డి, ఏడీఏ రమేష్ రెడ్డి, రెండో పట్టణ సీఐ నాగార్జున రెడ్డి, ఏఓ మమతారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

స్టార్టర్ల చోరీ



మల్లంపల్లిలో స్టార్టర్ చోరీ కావడంతో ఖాళీగా ఉన్న బాక్స్

ఏర్పేడు: మండలంలోని అముడూరు పంచాయతీ మల్లంపల్లి పొలాల్లో సోమవారం రాత్రి 30 వ్యవసాయ విద్యుత్ మోటార్ల స్టార్టర్లు చోరీకి గురయ్యాయి. వరిపైరు సాగు పొలాల్లో దొంగలు మోటారు స్టార్టర్లను ఎత్తుకెళ్లడంతో రైతులు లబోదిబోమంటున్నారు. ఇటీవల మండలంలో వ్యవసాయ విద్యుత్ మోటార్ల స్టార్టర్ల చోరీలు తరచూ జరుగుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పంటసాగు కోత దశకు చేరుకున్న తరుణంలో ఇలా స్టార్టర్లను చోరీ జరగడంతో ఆఖరి తడికి సాగునీటి సరఫరా చేయడం ఎలా అని బాధిత రైతులు ఆవేదన చెందుతున్నారు.

ఊరూరా చవితి సందడి



కొనుగోలు దారులతో కిక్కిరిసిన బజార్ వీధి



రేణిగుంట బస్టాండ్ కూడలి లో ఏర్పాటుచేసిన గణనాథుడి విద్యుత్ ఆర్చి

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో వినాయక చవితి పండుగ సందడి నెలకొంది. మండలంలో వినాయక చవిత సంబరాలు మొదలయ్యాయి. మంగళవారం మండల కేంద్రంలోని షాపులు వినాయకచవితి పూజ సామగ్రి సరుకులతో కళకళలాడాయి. వినాయక పూజ కోసం కావాల్సిసిన పూజ సామగ్రి, దుస్తులు, సరుకులను మండల ప్రజలు కొనుగోలు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు షాపులు కొనుగోలు దారులతో కిటకిటలాడాయి. యువకులు వినాయకుడి విగ్రహాలను కొనుగోలు చేశారు. మండలంలోని వినాయకుడి దేవాలయాలు విద్యుత్ దీపాలంకరణలో కళకళలాడాయి.

చవితికి సర్వం సిద్ధం

నాగలాపురం: పట్టణంలో పండుగ సందడి నెలకొంది. వినాయక చవితి పండుగను జరుపుకునేందుకు ప్రజలు సిద్ధమయ్యారు. స్థానిక బజారువీధిలో చిన్న చిన్న మట్టి వినాయకుని విగ్రహాలతోపాటు అరటి పిలకలు, పండ్లు, చెరుకు గడలు, స్వామి వారికి గొడుగులు, నెమలి పింఛాల విక్రయాలు జోరుగా సాగాయి. వినాయకుడి విగ్రహాలు ఒక్కొక్కటి రూ.30 నుంచి రూ.100 వరకు, కొంచం పెద్ద విగ్రహాలు రూ.వెయ్యి వరకు ధర పలుకుతున్నాయి.

మట్టి గణపతిని పూజించాలి

రేణిగుంట: భావితరాలు ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతి ఒక్కరూ మట్టి గణపతిని పూజించాలని తిరుపతి రష్ హాస్పిటల్ అధినేత, ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం పిలుపునిచ్చారు. రేణిగుంట పంచాయతీ భగత్ సింగ్ కాలనీలో మంగళవారం తిరుపతి రష్ హాస్పిటల్ అధినేత, ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం కాలనీ వాసులకు ఉచితంగా మట్టి వినాయకుడి విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు మట్టి గణపతి విగ్రహాలను పూజించాలని, ప్లాస్టర్ ఆఫ్ పారిస్, రంగుల విగ్రహాలను పూజించడంతో వాతావరణం కలుషితమై అనారోగ్యాల పాలయ్యే ప్రమాదం ఉందని తెలిపారు. వినాయక చవితి ఉత్సవాలు ప్రతి ఒక్కరు భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ నగేషం, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్, రవి, గంగాధరం పాల్గొన్నారు.

ముందస్తు చవితి సంబరాలు

బుచ్చినాయుడుకండ్రిగ: మండల కేంద్రంలోని అక్షర విద్యా సంస్థల్లో మంగళవారం ముందస్తు వినాయక చవితి సంబరాలు ఘనంగా జరిగాయి. ఎంఈఓలు రవీంద్రనాథ్, మునిసుబ్రమణ్యం ముఖ్య అతిథులుగా పాల్గొన్ని, విద్యార్థులకు కలసి వినాయకుడి విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. పాఠశాల కరస్పాండెంట్ కొండా మునిప్రతాప్ తీర్థప్రసాదాలు అందజేశారు.

మట్టి వినాయకుల పంపిణీ

శ్రీకాళహస్తి: పఁర్యావరణ పరిరక్షణలో భాగంగా యంగ్ ఎంప్లాయీస్ సోషల్ సర్వీసెస్ ఆధ్వర్యంలో 816 మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంస్థ అధ్యక్షుడు హేమకుమార్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రజలందరి బాధ్యత అన్నారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ వినాయకులను పూజించడం, వాటి నిమజ్జనం చేసే సమయంలో నీటి కాలుష్యం ఏర్పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు నారాయణ, చంద్రకాంత్, శ్రీనివాసులు, మునస్వామి, సురేష్ బాబు, అంజయ్య, రాజశేఖర్, ప్రదీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వరదయ్యపాళెంలో..

వరదయ్యపాళెం: వినాయకచవితి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు హిందువులు సిద్ధమయ్యారు. బుధవారం ఉదయం ఏకదంతుని తొలిపూజ చేసి, ఉత్సవాలకు శ్రీకారం చుట్టేందుకు గ్రామాల్లో యువత నుంచి పెద్దవారి వరకు ఏర్పాట్లలో నిమగ్నయ్యారు. పండుగ సామగ్రిని కొనుగోలు చేసేందుకు వచ్చిన జనంతో మండల కేంద్రం కిక్కిరిసింది. వినాయక విగ్రహాలను తరలించే పనిలో మంగళవారం యువత తలమునకలై ఉంది.

మండపాలు సిద్ధం

రేణిగుంట: వినాయక చవితి ఉత్సవాలకు రేణిగుంట మండలంలోని అన్ని గ్రామాల్లో మండపాలు సిద్ధం చేశారు. ప్రధానంగా బస్టాండ్ కూడలిలో విద్యుత్ దీపాలతో ఏర్పాటు చేసిన ఆర్చిలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. చవితి పూజా సామగ్రి కొనుగోలు చేసేందుకు ప్రజలు పట్టణానికి తరలిరావడంతో వీధులన్నీ కొనుగోలుదారులు తో నిండిపోయాయి.

శ్రీకాళహస్తిలో

శ్రీకాళహస్తి: పట్టణంలో మంగళవారం ఎక్కడ చూసినా చవితి సందడి కనిపించింది. మంగళవారం పట్టణవ్యాప్తంగా అన్ని రకాల పూజా సామగ్రిని వ్యాపారులు విక్రయానికి సిద్ధంగా ఉంచారు. ప్రజలు పూజా సామగ్రి కొనుగోలు పనిలో నిమగ్నమయ్యారు. కొనుగోలుదారులతో ప్రధాన మార్గాలన్నీ సందడిగా కనిపించాయి. ధరలు అధికంగా ఉన్నప్పటికీ కొనుగోలు చేశారు.



మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం



వరదయ్యపాళెంలో వినాయక మండపం వద్ద విద్యుత్ దీపాలంకరణ



వినాయకుడికి పూజలు చేస్తున్న ఎంఈఓలు



మట్టి వినాయకులను పంపిణీ చేస్తున్న యంగ్‌ఎంప్లాయీస్ సభ్యులు



నాగలాపురంలో సందడి



విక్రయానికి సిద్ధంగా వినాయక ప్రతిమలు



పండగ సామగ్రిని కొనుగోలు చేస్తున్న ప్రజలు



వరదయ్యపాళెంలో మట్టి వినాయక ప్రతిమలు

నేడు నవసంధి వినాయకులకు సారె సమర్పణ

శ్రీకాళహస్తి: వినాయక చవితిని పురస్కరించుకుని బుధవారం పట్టణంలోని నవసంధి వినాయకులకు ముక్కంటి సారె సమర్పించనున్నట్లు ఈఓ బాపిరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని నాలుగు మాడవీధుల్లో వినాయకులకు, పాతాళ వినాయకుడు, రుణ గణపతి, నాట్య గణపతి, స్కిట్ కళాశాలలో ఉన్న విజయగణపతికి ఉదయం 8 గంటలకు సారె అందజేస్తామన్నారు.

గురుకులాన్ని ఇంటర్ స్థాయికి పెంచండి

సత్యవేడు: స్థానిక బాలుర గురుకుల పాఠశాలను ఇంటర్ స్థాయికి పెంచాలని సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం కోరారు. మంగళవారం తిరుపతిలో బీసీ సంక్షేమ శాఖ మంత్రి సరితను కలిసి ఈమేరకు వినతి పత్రం అందజేశారు. అలాగే దాసుకుప్పం బైపాస్ రోడ్డు, నాగలాపురం–టీపీ కోట–చిన్నపాండూరు రోడ్డుకు నిధులను మంజూరు చేయించి, పనులను సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఆరణియార్ ప్రాజెక్ట్‌లో చేపడుతున్న అభివృద్ధి పనులకు అధనంగా రూ 40 లక్షలను కేటాయించాలని తుడా చైర్మన్ దివాకర్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు.

మదర్ థెరీసాకు నివాళి

రేణిగుంట: మదర్ థెరీసా జయంతి సందర్భంగా రేణిగుంటలోని ఆషా స్వచ్ఛంద సేవా సంస్థ కార్యాలయంలో మంగళవారం ఆ సంస్థ అధ్యక్షుడు జూలియన్ రాజు ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జూలియన్ రాజు మాట్లాడుతూ మదర్ థెరీసా చేసిన సేవలను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ ఉపాధ్యక్షుడు రమేష్ బాబు, సూపర్‌వైజర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

అవాంఛనీయ ఘటనలు జరిగితే చర్యలు

శ్రీకాళహస్తి: వినాయక చవితి వేడుకల్లో అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకుంటే చర్యలు తప్పవని శ్రీకాళహస్తి రెండో పట్టణ సీఐ నాగార్జునరెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని రెండో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని వినాయక విగ్రహ ప్రతిష్ఠ కమిటీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో పండుగ నిర్వహించుకోవాలన్నారు. డీజేలకు అనుమతి లేదన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

శాస్త్రోక్తంగా విగ్రహ ప్రతిష్ట



పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం



హారతి అందుకుంటున్న భూమన కరుణాకర్‌రెడ్డి

శ్రీకాళహస్తి: మండలంలోని గుంటకిందపల్లిలో వయ్యాల కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన రేణుకా పరమేశ్వరి ఆలయంలో మంగళవారం అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ, మహాకుంభాభిషకం శాస్త్రోక్తంగా నిర్వహించారు. శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం వేర్వేరుగా అమ్మవారిని దర్శించుకుని, పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో స్వర్ణమూర్తి, మావలపల్లి వెంకటేష్‌నాయుడు, శ్రీవారి సురేష్, పసల కృష్ణయ్య, ఆవుల శ్రీనివాసులు, అంకయ్య, చందు, గంగిరెడ్డి, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

రేణుకా పరమేశ్వరి సేవలో భూమన

శ్రీకాళహస్తి: మండలంలోని గుంటకిందపల్లిలో ఉన్న రేణుకా పరమేశ్వరిని తిరుపతి మాజీ ఎమ్మెల్యే, టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి మంగళవారం దర్శించుకున్నారు. ఆయనకు గ్రామ ప్రజలు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం ఆయన హోమ పూజల్లో పాల్గొన్నారు. ఆయన్ని వేదపండితులు ఆశీర్వదించి, తీర్థప్రసాదాలు అందజేశారు.

కుమారస్వామికి విశేష పూజలు

శ్రీకాళహస్తి: విజ్ఞానగిరిపై ఉన్న శ్రీవల్లి, దేవసేన సమేత కుమారస్వామివారికి మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. అలయ అర్చకులు కరుణాకర్ గురుకుల్ ఆధ్వర్యంలో స్వామివారికి పలు రకాల సుగంధ పరిమళ ద్రవ్యాలతో అభిషేకం జరిపారు. స్వామివారిని చందనంతో అలంకరించారు. విశేష పూజల అనంతరం భక్తులకు దర్శనంకల్పించారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. వారికి తీర్థప్రసాదాలు అందజేశారు.

యువకుడి అదృశ్యం

సత్యవేడు: మండంలోని నీలతొట్టికండ్రిగకు చెందిన ఎస్. విజయ్ మంగళవారం సాయంత్రం నుంచి కనిపించడం లేదని అతడి తండ్రి మునికృష్ణయ్య ఫిర్యాదు చేశారని ఎస్ఐ రామస్వామి తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ యువకుడు రెండు రోజుల కిందట విడుదలైన డీఎస్సీ పరీక్షల్లో తెలుగులో జిల్లాస్థాయి ప్రథమస్థాయి సాధించాడు.

స్వామిత్వ సర్వే పరిశీలన



సర్వేను పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ జాలిరెడ్డి

సత్యవేడు: మండలంలోని పలు పంచాయతీల్లో జరుగుతున్న స్వామిత్వ సర్వేను సూలూరుపేట డీఎల్‌పీఓ జాలిరెడ్డి పరిశీలించారు. మంగళవారం ఆయన స్థానిక ఎంపీడీఓ త్రివిక్రమరావు, సత్యవేడు పంచాయతీ కార్యదర్శి ముని రవికుమార్ తదితరులతో కలిసి పెద్ద ఈటిపాకం గ్రామంలో జరుగుతున్న స్వామిత్వ సర్వేను పరిశీలించారు. ఈ నేపథ్యంలో గ్రామానికి సంబంధించిన ఇళ్ల స్థలాలు, గృహాలు, కొలతలు తీయడం, వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేయడం వంటి వివరాలను సర్వే బృందం ద్వారా అడిగి తెలుసుకున్నారు. ఈ గ్రామంలో పంచాయతీ కార్యదర్శి పద్మనాభరాజు ఆధ్వర్యంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్ హరీష్ బృందం స్వామిత్వ సర్వే చేశారు. అనంతరం సత్యవేడు పట్టణంలోని దళవాయి అగ్రహారంలోని నాలుగో సచివాలయాన్ని డీఎల్‌పీఓ సందర్శించి, పలు రికార్డులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్ ప్రదీప్, అశోక్ చక్రవర్తి, అఖిల్, శిరీష, సర్వేయర్లు పాల్గొన్నారు.

ఎకో వినాయకునితో ప్రకృతికి భద్రత



ఎకో గణేష్ ప్రతిమ ఊరేగింపులో విద్యార్థులు, ఉపాధ్యాయులు

నారాయణవనం: జల వనరులు కాల్యుష్యం కాకుండా మట్టి వినాయక ప్రతిమలను పూజలకు వినియోగించుకోవాలని బాలికల ఉన్నత పాఠశాల–ప్లస్ ప్రధానోపాధ్యాయులు మనోహరి పేర్కొన్నారు. వినాయకచవితి సందర్భంగా మంగళవారం పాఠశాలలో ఘనంగా వినాయక పూజలను చేశారు. కోలాటాల మధ్య మట్టి వినాయకుడిని ఊరేగింపుగా మండపంలో ప్రతిష్ఠించి, పూజలు జరిపారు. పూజ అనంతరం మట్టి వినాయక ప్రతిమను పాఠశాల ఆవరణలో గుంత తవ్వి నిమజ్జనం చేసి మొక్క నాటారు. మండలంలో వందకు పైగా గణేష్ విగ్రహాలను నిర్వాహకులు ప్రతిష్ఠించారు. సముదాయంలోని టీటీడీ అనుబంధ శక్తి వినాయకస్వామి ఆలయంలో బుధవారం ఉదయం సర్కారు అభిషేకం, సాయంత్రం మూషిక వాహనంపై గ్రామోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయాధికారి నాగరాజు తెలిపారు.

ఏపీటీఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక



వి.ఆనంద్, రాయపాడు గోపాల్ , వెంకటాద్రి

శ్రీకాళహస్తి: ఏపీటీఎఫ్ శ్రీకాళహస్తి పట్టణ నూతన కార్యవర్గ ఎన్నిక మంగళవారం నిర్వహించారు. ఎన్నికల అధికారిగా ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మురళీకృష్ణ వ్యవహరించారు. అధ్యక్షుడిగా ఆర్ గోపాల్, ప్రధాన కార్యదర్శిగా వెంకటాద్రి, గౌరవాధ్యక్షుడిగా ఆనంద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా గోపాల్ మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే ఉద్యోగులకు ఇవ్వాల్సిన బకాయిలన్నీ చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రధాన కార్యదర్శి వెంకటాద్రి మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి అంకితభావంతో పనిచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీహరి, చంద్రారెడ్డి, గుణశేఖర్, రవి, శ్రీనివాసులు, హేమకుమార్, చంద్రశేఖర్, కరుణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

అనధికార ఆటోస్టాండ్

పట్టించుకోని అధికారులు



పాత బలరాం థియేటర్‌పక్క సందులో ఆగి ఉన్న ఆటోలు

శ్రీకాళహస్తి: పట్టణంలో కూరగాయల మార్కెట్ వద్ద ఉన్న పాత బలరాం థియేటర్ వీధిలో ఇటీవల అనధికారికంగా ఏర్పాటు చేసిన ఆటో స్టాండ్‌ను డీఎస్పీ నరసింహమూర్తి తొలగించారు. నోపార్కింగ్ బోర్డులు ఏర్పాటు చేశారు. ఆటోల నిర్వాహకులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. అయితే కొద్దిరోజుల తరువాత షరామామూలే అన్నట్లుగా నో పార్కింగ్ బోర్డులను పెట్టినా తమకేమి పట్టనట్లు మళ్లీ ఆటోలు, గూడ్స్ వాహనాలు నిలుపుతున్నారు. అసలే ఇరుకు సందు కావడంతో వాహనచోదకులు, స్థానిక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

టీడీపీ పార్లమెంట్ విస్తృతస్థాయి సమావేశం

రేణిగుంట: తెలుగుదేశం పార్టీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నరసింహయాదవ్ అధ్యక్షతన మంగళవారం రేణిగుంట పాత చెక్ పోస్ట్ సమీపంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో తిరుపతి పార్లమెంట్ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత, బ్రాహ్మణ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ బుజ్జి రాంప్రసాద్, ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు పాల్గొన్నారు. పార్టీ నాయకుల నుంచి పార్లమెంట్ కమిటీ, అనుబంధ కమిటీ, సాధికార కమిటీ, రాష్ట్ర కమిటీలకు ప్రతిపాదనలను స్వీకరించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు నెలవల విజయశ్రీ , పాసిం సునీల్, కురుగొండ్ల రామకృష్ణ, మాజీ మంత్రి పనబాక లక్ష్మి, తుడా చైర్మన్ డాలర్ దివాకర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ



ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న ట్రైనీ ఎస్ఐ రామాంజనేయులు

వరదయ్యపాళెం: మండలంలోని ఎరువులు, పురుగు మందుల దుకాణాలను వరదయ్యపాళెం, శ్రీసిటీ పోలీసులు వేర్వేరుగా తనిఖీ చేశారు. వరదయ్యపాళెంలోని ఎరువుల దుకాణాలను ట్రైనీ ఎస్ఐ రామాంజనేయులు, హెడ్ కానిస్టేబుల్ సాయిబాబా, శ్రీసిటీ పరిధిలోని చిన్న పాండూరు ప్రాంతంలో సీఐ బీవీ శ్రీనివాసులు, ఎస్ఐ అరుణ్‌కుమార్ రెడ్డి సిబ్బందితో కలసి మంగళవారం తనిఖీ చేశారు. దుకాణాల వారీగా నిల్వ ఉన్న ఎరువులు, పురుగు మందులను పరిశీలించి వివరాలను నమోదు చేసుకున్నారు. వారి వెంట వ్యవసాయశాఖ ఏఈఓ ప్రవీణ్ ఉన్నారు.